

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి



స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ను మంగళవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్‌పి తుహిన్ సిన్హా పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత జాగ్రత్తగా పహారా కాయాలని, ఇతరులను ప్రాంగణంలోకి అనుమతించరాదని ఆదేశించారు. లాగ్ బుక్ లో సంతకాలు చేశారు. సిసి కెమెరాల నిఘాను పర్యవేక్షించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్‌కు

అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ

● ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -పాడేరు : వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న సిఆర్‌టిలు, ఇతర సిబ్బంది రెగ్యులేషన్‌లో అక్రమ వసూళ్లకు, అక్రమాలకు పాల్పడినట్లు కొంతమంది సిఆర్‌టిలు చేస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు ధర్మన్న పడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్‌చేశారు.

సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలు దీనిపై స్పందించాలని కోరారు. ఈ విషయంపై మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ అధ్యక్షులు ధర్మన్న పడాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులైజేషన్ కోసం ఆదివాసీ గిరిజన సంఘం అనేక మార్లు పాడేరులో ఉద్యమం నిర్వహించి రాజకీయ డిమాండ్‌గా మార్చడంలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం అనుమతించిందని, ఇది ఆదివాసీ గిరిజన సంఘం సాధించిన విజయమన్నారు. అయితే కొంతమంది అవినీతి అధికారుల నిర్వాకం వలన అర్హులైన అనేక మంది ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని, దీనిపై దృష్టి పెట్టాలనికోరారు. జిల్లా అధికార్లకు ఫైల్ పంపకుండా రాష్ట్ర అధికార్లు, వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కుమ్మక్కై అక్రమ వసూలు చేశారనీ, ఒక్కొక్కరి నుంచి రాష్ట్ర ప్రభుత్వ అధికార్లకు రూ.ఒక లక్ష, జిల్లా అధికారులకు రూ. 25వేలు చొప్పున ఇవ్వాలని వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. దీని వల్ల ముడుపులు చెల్లించలేని అర్హులైన ఎందరో రెగ్యులరైజేషన్ అవకాశాన్ని కోల్పోవడమే కాకుండా, కొందరు అడ్డదారికి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు.

గురుకులాల్లో ఇంటర్ సీట్లు పెంచాలి

● ఐటిడిఎ పిఒ, డిడిలకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి -పాడేరు :అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో గ్రూపుల వారీగా సీట్లు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, జీవన్‌కృష్ణ కోరారు. మంగళవారం ఐటిడిఎ పిఒ, గిరిజన సంక్షేమ డిడిలకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాల ప్రాంగణంలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు గిరిజన బాలురకు కౌన్సెలింగ్‌కు అటు అధికారులతో పాటు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పలువురు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నా ఇంటర్‌లో ప్రవేశాలకు సీట్లు రాని పరిస్థితి ఉందని, దీనిపై దృష్టి సారించి, అందరికీ సీట్లు వచ్చేలా వాటి సంఖ్యను పెంచాలని పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, గిరిజన సంక్షేమ డిడి కొండలరావులకు వినతిపత్రాలను అందజేశారు. 1700 మంది బాలురు దరఖాస్తు చేసుకుంటే 800 మందికి మాత్రమే సీట్లు కేటాయించడం దారుణమన్నారు. గిరిజన బాలలకు ఉన్నతవిద్యావకాశాలు అందుబాటులోకి రావాలంటే తప్పకుండా సీట్లు పెంచి వారికి న్యాయం చేయాలని కోరారు.

దీనిపై ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ స్పందిస్తూ ఇంటర్‌లో ప్రవేశానికి అందరికీ సీట్లు వచ్చేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు మత్స్యరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

అంగన్వాడీ కేంద్రంలో ఆర్‌జెడి తనిఖీలు



అంగన్వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలో అడుగులపుట్టు పంచాయతీ తమరాడఅ ంగన్వాడీ కేంద్రాన్ని అల్లూరి జిల్లా ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్, సూర్యలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు, ప్రీస్కూల్ పిల్లలకు పంపిణీ చేస్తున్న బియ్యం, పప్పు, నూనె, పాలు, అందుతున్నాయా లేదా వివరాలపై ఆరా తీశారు. గ్రామంలోని అంగన్వాడీ లబ్ధిదారులతోపాటు స్థానిక గిరిజనులతో సమావేశమై, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న అంగన్వాడీ పౌష్టికాహారం తీరు, దాని వినియోగంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిడిపిఒ ఎం.వరహాలమ్మ, సూపర్‌వైజర్స్, ఎం.సింహాచలం, బి సింహాచలం, సరస్వతి పాల్గొన్నారు,

గ్రంథాలయంలో ఆటల పోటీలు



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : స్థానిక శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు, చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. మంగళవారం చిన్నారులకు యోగ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో 20 మంది చిన్నారులు పాల్గొన్నారు లైబ్రేరియన్ ఎస్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు యోగా, వ్యాయామం, ఆటలు అవసరమని, వీటి వల్ల శారీరక దృఢత్వం, మానసిక వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సుబ్బారావు పాల్గొన్నారు.

అరటి సాగు.. బాగు..బాగు!

● ఆశాజనకంగా దిగుబడులు, ఆదాయం

● ఆసక్తి చూపుతున్న గిరిజన యువత

● ఎకరానికి రూ.లక్ష వార్షికాదాయం

గ్యారెంటీ అంటున్న యువరైతు నీలకంఠం

● ఐటిడిఎ, ఉద్యానవనశాఖ తోడ్పాటుకు అభ్యర్థన



ప్రజాశక్తి-పాడేరు: డిగ్రీలు చదివి ఉద్యోగాల కోసం ఏళ్ళ తరబడి నిరీక్షిస్తున్న మన్యంలోని గిరిజన యువత ప్రస్తుతం స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరి చాలీచాలని జీతాలతో బతకడం కంటే, తమ మన్యంలోనే తోటల పెంపకం, నూతన వంగడాలు, పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మన్యానికి అనుకూలమైన తోటల పెంపకంపై దృష్టి పెడితే స్వయం ఉపాధితో పాటు మంచి లాభార్జన, వనాల పెంపకం వంటి ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయని గిరిజన యువత భావిస్తున్నారు. పాడేరు మండలం లంపెల్లి గ్రామానికి చెందిన గిరిజన యువరైతు తరడా నీలకంఠంనాయుడు అరటి సాగు చేపట్టి ఆశాజనకంగా దిగుబడి సాధించి గిరిజన యువతకు ఆదర్శంగా, ఒక ప్రోత్సాహకుడిగా మార్గనిర్దేశం చేస్తున్నాడు.

బిఎస్‌సి పట్టభద్రుడై తర్వాత బిఇడి, పిజి కోర్సు కూడా పూర్తి చేసుకున్న నీలకంఠం కొన్నాళ్లు ఉద్యోగం కోసం నిరీక్షించి చివరికి ఉద్యోగం రాకపోవడంతో ఇటీవల వివాహం చేసుకొని ఉపాధి కోసం ఆదాయ మార్గాలను వెతుకుతూ తనకు ఉన్న ఒక ఎకరా విస్తీర్ణం గరువులో దుక్కి దున్ని అరటి సాగును ప్రారంభించాడు. ఏడాది కాలంలోనే అరటి సాగు వల్ల వచ్చిన లాభాలను, తన అనుభవాలను సోషల్ మీడియా ద్వారా ఇతర గిరిజన యువ రైతులకు వివరిస్తూ, అరటి మొక్కలను తక్కువ ధరకే సరఫరా చేసి తోడ్పాటు అందించేందుకు ముందుకు వచ్చాడు. నిరుద్యోగ గిరిజన యువత తమ గ్రామాల్లో అరటి సాగు చేపడితే స్వయం ఉపాధి లభిస్తుందని అందరికీ అవగాహన కల్పిస్తుండడంపై పలువురు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా నీల కంఠం నాయుడు ప్రజాశక్తితో అరటి సాగుపై తన అనుభవాలను తోటల పెంపకం పై ఆసక్తి వ్యక్తం చేశారు.

ఎకరా విస్తీర్ణంలో అరటి సాగుకు రూ. 8 వేల వ్యయం

ఒక ఎకరా విస్తీర్ణంలో అరటి సాగుకు రూ.8 వేల అవుతుందని, దీని ద్వారా వార్షికాదాయం ఏడాదికి మినిమం లక్ష రూపాయలు వస్తుందని నీలకంఠం నాయుడు తెలిపారు. పరిస్థితులు, ధర కాస్తా అనుకూలిస్తే ఇంతకంటే ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని వివరిస్తున్నాడు. తాను మైదాన ప్రాంతంలోని వడ్డాది పరిసరాల్లో అరటి సాగు పద్ధతులను పరిశీలించి, వాటిపై అవగాహన పొంది, అక్కడ రైతుల నుంచే మొక్క రూ.15 చొప్పున కొనుగోలు చేసి తెచ్చి సాగుచేసానని అంటున్నాడు.. గత ఏడాది తన ఒక ఎకరా విస్తీర్ణంలో ఎనిమిది వందల అరటి మొక్కలు నాటానని తెలిపారు. ఈ హైబ్రిడ్ అరటి దిగుబడి బాగుందని, అరటి గెలలు ఏపుగా వచ్చాయని అంటున్నారు. పొలం ఉండి సాగునీటి వసతి ఉంటే అరటి సాగు చేపడితే చాలా లాభదాయ కమని, నిరుద్యోగ యువత ఉపాధి కోసం అరటి సాగు చేపట్టాలని సూచిస్తు న్నాడు. గిరిజన నిరుద్యోగ యువ రైతుల్ని ప్రోత్సహిం చడం కోసం తాను అరటి మొక్కల్ని రూ.పదికే ఒక్కొక్కటీ అందజేస్తా నంటున్నాడు. తక్కువ ఖర్చు, శ్రమతో అరటి సాగు యువ రైతులకు సౌలభ్యంగా ఉంటుందన్నాడు. ప్రస్తుతం ఏప్రిల్ నుంచి జూలై వరకు ఈ అరటి మొక్కల్ని నాటితే, పంట దిగుబడి బాగుండి, మంచి లాభాలు వస్తాయంటున్నాడు. అరటిసాగు వల్ల నష్టం వచ్చే పరిస్థితి ఉండదన్నాడు. కాఫీ మాదిరిగానే అరటి సాగుకు కుటుంబ సభ్యులతో కలిసి సొంతంగానే పనులు చేసుకునే అవకాశం ఉందని, ఇంటి ఆవరణలోని దొడ్లు గరువుల్లో దుక్కు దున్ని ఒక ఎకరా విస్తీర్ణం వరకు అరటి మొక్కలు పెంచితే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.

ఐటిడిఎ హార్టీకల్చర్ విభాగం తోడ్పాటునివ్వాలి

.పండ్ల తోటల పెంపకానికి ముందుకు వచ్చే నిరుద్యోగ గిరిజన యువతకు ఐటిడిఎ, హార్టీకల్చర్ విభాగం తోడ్పాటు అందించాలని నీలకంఠం నాయుడు కోరుతున్నాడు. ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా ఎంతోమంది నిరుద్యోగ యువత ఉన్నారని, వారిలో చాలామంది రైతు పని తెలిసిన వారేనని, అరటి ఇతర పండ్ల తోటల పెంపకానికి తోడ్పాటు ఇస్తే ఏజెన్సీలో నిరుద్యోగ సమస్య పరిష్కారమౌతుందన్నాడు ఉద్యాన శాఖ ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు ఇచ్చి పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందించాలని నీలకంఠం నాయుడు కోరారు.



రబ్బరు తోటల సాగుకు ప్రోత్సాహం

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాల్లో కొత్తగా రబ్బర్ తోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం, మారేడుమిల్లి, వై రామవరం మండలాల ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒలు, గ్రామ సచివాలయల హార్టికల్చర్, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రబ్బర్ బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ తదితరులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ వారం రోజుల్లో రబ్బర్ రైతులను గుర్తించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా 1250 ఎకరాలలో (500 హెక్టార్లు) పంచాయతీరాజ్ శాఖ నుండి ఉపాధి హామీ పథకం ద్వారా రబ్బర్ ప్లాంటేషన్ వేసుకునే విధంగా అనుమతులు వచ్చినట్లు చెప్పారు. ఒక్కొక్క ఎకరానికి సుమారు 200 రబ్బరు మొక్కలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సంబంధిత రైతులు రబ్బర్ మొక్కలు పెంచుకోవడానికి ఉపాధి హామీ పథకం ద్వారా లక్షా 64 వేల రూపాయలు, రబ్బర్ బోర్డు ద్వారా రూ.14,400, మొత్తం లక్ష 75 వేల రూపాయలు మూడు సంవత్సరాలకు గాను ఒక్కొక్క ఎకరానికి రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రబ్బర్ రైతులు కంచె వేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, ఎరువులు వేయడం తదితర పనులు తమ ప్లాంటేషన్‌లోనే చేసుకున్నందుకు ఉపాధి హామీ పనుల ద్వారా కూలి డబ్బులు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. రైతుల నుండి దరఖాస్తులు వచ్చిన తరువాత సంబంధిత భూమి రబ్బర్ ప్లాంటేషన్‌కు అనువుగా ఉన్నదీ లేనిదీ, నీటి సదుపాయం ఉన్నదీ లేనిదీ ముందుగా పరిశీలించాలని సంబంధిత అధికారులను పిఒ ఆదేశించారు. ఈ రబ్బర్ ప్లాంటేషన్ వర్షాకాలంలోనే వేసుకునే విధంగా ఎంపిక చేసిన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు పొందిన వారు కూడా రబ్బర్ ప్లాంటేషన్ వేసుకునేందుకు అర్హులేనని పేర్కొన్నారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు మాత్రమే దీనికి అర్హులని తెలిపారు. ఈ సమావేశంలో పిహెచ్‌ఓ చిట్టిబాబు, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాస్, పీఏఓ జి.రాంబాబు, రబ్బర్ బోర్డు ఏడిఓ శరత్ చంద్, ఏడిఏ సిహెచ్‌కెవి చౌదరి, హార్టికల్చర్ అధికారి ముత్తయ్య, ఉపాధి హామీ పథకం ఏపీవోలు, గ్రామ సచివాలయాల అగ్రికల్చరల్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, సబ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మూగజీవి మృతి

ప్రజాశక్తి -సీలేరు : జియో టవర్ నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్ గురై గిరిజన రైతుకు చెందిన ఒక మూగ జీవి మృత్యువాత పడింది. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం సంకట పంచాయతీ గోవాడలో జియో టవర్ ఏర్పాటు చేశారు. దీనికి అనుకొని ఉన్న మరో స్తంభానికి విద్యుత్ సరఫరా జరుగుతూ షాక్ కొడుతోంది. దీనిపై గ్రామస్తులు అనేకసార్లు జియో టవర్ నిర్వాహకులు దృష్టి తీసుకెళ్లినా వారు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో మంగళవారం జియో టవరు పరిసరాల్లో ఒక పశువు సంచరిస్తూ ప్రమాదవస్తు స్తంభానికి తాకడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. జియో టవర్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే మూగజీవి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని, బాధిత రైతుకు జియో టవర్ నిర్వాహకులు నష్టపరిహారం చెల్లించాలని గిరిజన రైతు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జియో టవర్‌కు అనుకున్న స్తంభానికి విద్యుత్ సరఫరా కాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.



సంఘటనా స్థలంలో మూగజీవి మృతదేహం



సీలేరులో కురుస్తున్న వర్షం

ఈదురుగాలులతో కుండపోత వర్షం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దుప్పులవాడ, దారకొండ పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఒక్కసారిగా ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. దీంతో కొంత మంది వ్యాపారులు దుకాణాలు మూసివేసి ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీటితో డ్రెయినేజీలు పొంగి ప్రవహించాయి. వాతావరణం చల్ల బడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. భారీ వర్షం గిరిజన రైతుల్లో ఎనలేని ఆనందాన్ని నింపింది. పోడు వ్యవసాయానికి, మెట్టు భూముల్లో ముందస్తుగా దుక్కులు దున్నుకోవడానికి అణువుగా ఉందని రైతులు చెబుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఓ ప్రశాంత్‌కుమార్, ఎఎస్‌పి జగదీష్

ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

రంపచోడవరం రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

జూన్ 4వ తేదీన జరగబోవు ఓట్ల లెక్కింపునకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్కడికి అక్కడ కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కౌంటింగ్‌పై రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్, అడిషనల్ ఎస్పీ జగదీష్.హెచ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం స్ట్రాంగ్ రూముల్లో ప్రతిష్టాత్మకమైన 24X7 భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ రోజున వివిధ మండలాల నుండి ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు కౌంటింగ్ కేంద్రాల దగ్గరకు రాకూడదని, ఆయా మండలాల్లోనే వియోత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించడం జరిగిందని, కౌంటింగ్ రోజు కూడా పోటీలో ఉన్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరైనా అతిక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోటీలో ఉన్న అభ్యర్థులు పల్లాల లచ్చిరెడ్డి, బంగారు వెంకటేష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొమ్మిశెట్టి బాలకృష్ణ, శివకుమార్ పెంటపాటి, అనంత మోహన్, జి.తాతారావు, డిప్యూటీ తహశీల్దార్లు ఎన్‌వివి సత్యనారాయణ, శివ, శ్రీధర్, సిఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహనరావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకయ్య

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎవరైనా ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినా, నిబంధనలు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్.వెంకయ్య హెచ్చరించారు. స్థానిక గాంధీ సెంటర్ వద్ద మంగళవారం ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికలు అయిపోయాయి కదా అని గ్రామాల్లో రచ్చబండలు, కిల్లీకొట్లు, సెలూన్ షాపులు, హోటళ్లు వద్ద ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే అటువంటి వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఎన్నికలు శాంతియుతంగా, ప్రశాంతంగా జరగడానికి ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జూన్ 4 కౌంటింగ్ రోజు ఆ తర్వాత రోజు ఇదే విధంగా సహకరించాలని కోరారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే పరిస్థితులు చక్కదిద్దడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. పెట్రోల్ బంకుల వద్ద బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్ పోయడం ప్రస్తుతం నిషేధించడం జరిగిందని, వాహనాలలో మాత్రమే పెట్రోల్ పోస్తారని, ఎవరైనా లూజ్ పెట్రోల్ పోయాలని తగాదాలకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎన్ కుశరాజు, చందర్రావు, ఎన్ రాంబాబు, మరిచర్ల ప్రసాద్, పాల్గొన్నారు.

చింతూరులో రాజీవ్ గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - చింతూరు

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా చింతూరు మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారతవానికి పునాదులు వేసి, అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి, చివరి క్షణం వరకు దేశం కోసం బతికిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే అహమ్మద్ అలీ, నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్లాబ్ పెచ్చులూడిన పంచాయతీ భవనం

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ భవనం స్లాబ్ పెచ్చులూడడంతో అందులో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రారంభమైన తరువాత గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామ సచివాలయాన్ని నడుపుతున్నారు. పంచాయితీ భవనం పాతది కావడంతో స్లాబ్ పగిలి పెచ్చులూడి కింద పడుతున్నాయి. దీంతో ఎప్పుడు పెచ్చులూడి తమపై పడతాయోనని సచివాలయ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయంలో వివిధ సేవల నిమిత్తం వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చి నాలుగేళ్లయినా నేటికీ కొత్త భవనం నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటికైనా కొత్త సచివాలయ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.



వడ్డి గూడెం పంచాయతీ భవనం పెచ్చులూడుతున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ స్పష్టం చేసారు. ఈనెల 4న నిర్వహించే ఓట్లు లెక్కింపు ప్రక్రియపై మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో అరకు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని తాహశీల్దారులు, డిప్యూటీ తాహశీల్దారులతో సమావేశం నిర్వహించారు. ఓట్లు లెక్కింపు నిర్వహణ, స్ట్రాంగ్‌రూం నుంచి కౌంటింగ్ హాలుకు ఇవిఎంల తరలింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. కౌంటింగ్ హాలులో ఇవిఎంలకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్లుకు మూడు టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్‌లో. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి టేబుల్ వద్ద సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్, మరొక సహాయకులు ఉంటారన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

ప్రతిరోజూ స్ట్రాంగ్ రూం పరిశీలనలో భాగంగా అరకు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలకు వేసిన సీళ్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డిసి వివిఎస్. శర్మ, పలువురు తాహశీల్దారులు, డిప్యూటీ తాహశీల్దారులు పాల్గొన్నారు.

విద్యా కానుకల సత్వర పంపిణీకి చర్యలు

సమగ్రశిక్ష రాష్ట్ర ప్రోగ్రామింగ్ అధికారి రమణ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: : అల్లూరి జిల్లా కేంద్రంలోని విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రోగ్రామింగ్ అధికారి రమణ మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా స్థానిక ప్రైమరీ పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్‌ను మండల విద్యాశాఖ అధికారులు ఎస్ రామచంద్రరావు, సిహెచ్ సరస్వతితో కలిసి సందర్శించారు. స్టాక్ పరిశీలన అనంతరం అధికారులతో మాట్లాడుతూ పాఠశాలలు తెరిచేసరికి ప్రతి పిల్లవాడికి విద్యాకానుక కిట్లు అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాక్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత విభాగానికి సమాచారం అందించాలని ఆదేశించారు. కిట్లలో ఉండాల్సిన అన్ని వస్తువులు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిఎంఒ జ్ఞాన ప్రకాష్, ఎంఎఒ భాస్కరరావు, మండల కోఆర్డినేటర్ జైరాజ్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీను, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్ విద్యాకానుక కిట్లను చూపుతున్న రాష్ట్ర అధికారి రమణ

సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో ఈ నెల 24 నుంచి జరగనున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో పదో తరగతి సప్లిమెంటరీ, ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ పద్మావతి మాట్లాడుతూ ఈనెల 24 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30గంంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు నిర్వహించే పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 1,530 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.వీరిలో ఇందులో 1,118 మంది రెగ్యులర్ విద్యార్థులుకాగా, 412 మంది ప్రైవేటు విద్యార్థులున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు ఏడు కేంద్రాలను ఎంపికచేసి, వాటికి చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, స్క్వాడ్, రూట్ అధికారులను నియమించామన్నారు.. పదవ తరగతి ప్రధానపరీక్షలు మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్, తాగునీరు, రవాణా వంటి మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. ం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని స్పష్టం చేశారు.

అనంతరం ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై డి ఆర్ఓ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పది పరీక్షలకు 424 మంది, ఇంటర్ పరీక్షలకు 321 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 02.30గం.ల నుంచి సాయంత్రం 05.30గం.ల వరకు పరీక్షలు జరుగుతాయని, జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించబడతాయని వివరించారు. వీటి నిర్వహణ కోసం ఇప్పటివరకు 4 పరీక్షా కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ప్రతీ కేంద్రం వద్ద అధికారులను నియమించడం జరిగిందని ఆమె తెలిపారు. పది సప్లిమెంటరీ పరీక్షలు, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా ఆయా అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు . ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ , అసిస్టెంట్ కమిషనర్ అఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్. శశి కుమార్, పోలీస్, ఆర్.టి.సి, వైద్యఆరోగ్యం, రవాణా, తపాలా, విద్యుత్ తదితర శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ పద్మావతి

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



రబీ వరి చేనును నూర్పుస్తున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రబీ సీజన్ చివరి దశ, ముందస్తు ఖరీఫ్ పనుల్లో గిరిజన రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ పొలాల్లో దుక్కులు దున్నుతూ వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. ఈ సీజన్లో ప్రధానంగా గిరి రైతులు వరి, సామ పంటలతోపాటు ఆరికలు, రాగి వంటి అల్లం, వేరుశనగ పంటలను పండిస్తున్నారు. దీంతోపాటు రబీసీజన్లో రెండోపంటగా సాగు చేసిన వరిపైర్లు కోత, నూర్పిడి పనులు చేస్తున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో పూర్తి వ్యవసాయ సీజన్ సందడి నెలకొంది. వేసవి సెలవులకు ఇళ్లకు చేరుకున్న గిరిజన బాలలు తమ తల్లిదండ్రులతో కలిసి పంట పొలాలకు వెళుతూ, తమకు చేతనైన వ్యవసాయ పనులతో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. కాగా వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలను గిరిజన రైతులకు అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలను అధికారులు చేపట్టాలని కోరుతున్నారు.



దుక్కి పొలంలో గొప్పు పనుల్లో గిరిజన రైతు కుటుంబం

టీబీ నిర్మూలనకు బీసీజీ వ్యాక్సిన్

ప్రజాశక్తి-మధురవాడ : టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి గురువారము మధురవాడ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సచివాలయాల్లో, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో బీసీజీ వ్యాక్సిన్ ప్రతి గురువారమూ అందుబాటులో ఉంటుందని మధురవాడ టీబీ యూనిట్ సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తెలిపారు. ఐదేళ్ల క్రితం టీబీ వచ్చిన తగ్గిపోయిన వారు, 18 ఏళ్ల నిండిన వారు, పొగ తాగేవారు, సుగర్ వ్యాధి గ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, టీబీ రోగులతో దగ్గరి సంబంధం ఉన్న వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన కోరారు. మధురవాడ టీబీ యూనిట్ పరిధిలో ఉన్న సాగర్‌నగర్, రుషికొండ, పిఎం పాలెం, వాంబే కాలనీ, స్వతంత్ర నగర్, మిధిలాపురి, విశాలాక్షి నగర్, మారికవలస, బక్కన్నపాలెంలోని యుపిహెచ్‌సిల్లో, సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకుంటే టీబీ బారిన పడకుండా ఉంటారని వివరించారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ,మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.విశాఖపట్నం, ఎన్ఎడి కొత్త రోడ్డు, బుచ్చిరాజుపాలేనికి చెందిన తెంటూ సాయికిరణ్ దుర్గేష్ (24) బైక్‌పై ఏలూరు బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తిరిగి వస్తూ రాజమండ్రిలో ఉంటున్న విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజ్ స్నేహితుడు తిప్పట్ల వినయ్ (25) ఇంటికి వెళ్లాడు.తన స్నేహితుడు వినయ్‌తో కలిసి సాయికిరణ్ దుర్గేష్ స్వగ్రామం బయలుదేరాడు. ఉద్దండపురం వద్దకు వచ్చేసరికి రేబాక, గుల్లిపాడు మీదగా వస్తున్న ప్రైవేటు బస్సు అతివేగంగా వచ్చి బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్ డ్రైవింగ్ చేస్తున్న వినయ్ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. సాయికిరణ్ దుర్గేష్‌కు ఎడమ కాలుకు బలమైన గాయమైంది .108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు .తీవ్రంగా గాయపడ్డసాయికిరణ్ దుర్గేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విజయ్‌కుమార్ వెల్లడించారు

విశ్రాంత ఉద్యోగి మృతి


తగరపువలస : స్థానిక వలందపేట సర్వీస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమిలి మండలం ఆర్.తాళ్లవలస గ్రామానికి చెందిన డి.వెంకటపతిరాజు (64) మృతి చెందారు. ఇతను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటపతి రాజు స్కూటీపై పూజ సామగ్రి కోసం సంగివలస వచ్చి తిరుగు ప్రయాణంలో తాళ్లవలస వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు వలందపేట సర్వీస్ రోడ్డు వద్ద స్కూటీని బలంగా ఢీకొంది. స్కూటీతో పాటు అతన్ని కొద్ది దూరం లాక్కుపోయింది. దీంతో తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని కుమార్తె సాయిలక్ష్మి ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ జి.హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో బంటుపల్లి వారి కల్లాలులో ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి మద్యం మత్తులో మందుబాబులు వీరంగం సృష్టించారు. రౌడీ షీటర్ కొట్టాన గణేష్, మరో నలుగురు మద్యం తాగరు. కొంత సమయం తర్వాత వీరి మధ్య వివాదం తలెత్తింది. కొట్టుకున్నారు. దీంతో చందక గ్రామానికి చెందిన రెడ్డి గురునాయుడుకు బలమైన గాయాలయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యాన సంఘటనా స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వారికి విశాఖ స్పెషల్ సెషన్ కోర్ట్ జడ్జి 14 రోజులపాటు రిమాండ్ విధించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లో భద్రతా చర్యలపై ఆరా తీశారు. ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు వెలువడే సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీసులకు సూచించారు. పెట్రోల్ బంక్‌ల వద్ద, బయట దుకాణాల్లో లూజ్ బాటిల్స్‌లో పెట్రోలు, డీజిల్ విక్రయాలు జరగకుండా నిఘా పెంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిన సిఐ ఎస్ రమేష్, ఎస్ఐ పి.మనోజ్‌కుమార్, స్థానిక పోలీస్‌సిబ్బందిని అభినందించారు.



పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలో ఎస్‌పి తుహిన్ సిన్హా



తులసి పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, బేబిరాణి, కుమార్ తదితరులు

అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తులసికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గుండెపోటుతో సోమవారం రాత్రి అల్లిపురంలో కన్నుమూసిన ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి అంత్యక్రియలు మంగళవారం అశ్రు నయనాల నడుమ సాగాయి. కడసారి ఆమెను చూసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చారు. తులసి పార్థివదేహం వద్ద నివాళ్లర్పించారు. తులసి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. ఈ ఏడాది జనవరిలో ఉధృతంగా సాగిన అంగన్వాడీల సమ్మెకు నాయకత్వం వహించారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం లెక్క చేయకుండా ధైర్యంగా నిలబడ్డారు. గతంలో టిడిపి ప్రభుత్వ నిర్బంధాన్నీ ఇదే విధంగా ఎదుర్కొన్నారు. తులసి మృతి విషయం తెలిసిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాల నేతలు అల్లిపురానికి తరలివచ్చి నివాళ్లర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ విశాఖ కన్వీనర్ పి.మణి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగశేషు, కుమారి, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు. తులసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. తులసి అంతిమయాత్రలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, గౌరవ సలహాదారు బృందావతి, ప్రాజెక్టు లీడర్స్ వెంకటలక్ష్మి, నూకరత్నం, శోభారాణి, పద్మ, లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, సీతా తదితరులు పాల్గొన్నారు. తులసి ఆకస్మిక మరణం పట్ల ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఒక ప్రకటన విడుదల చేస్తూ తులసి మంచి నిబద్ధత కలిగిన నాయకురాలు అని కొనియాడారు.

తులసికి ఐద్వా నివాళి

అనకాపల్లి : తులసి మృతికి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఐద్వా నాయకులు తులసికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ అంగన్వాడీ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులుగా అంగన్వాడీలు 42 రోజుల దీక్షలు చేపట్టడంలో తులసి కీలకపాత్ర పోషించారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. తులసి మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఐద్వా విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు బి.పద్మ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, సహాయ కార్యదర్శి డిడి.వరలక్ష్మి, ఆర్.లక్ష్మి, జి.సుభాషిణి, కె.శాంతి, విజయ, కృష్ణవేణి, నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

భెల్ సిఐటియు సంతాపం

గాజువాక : అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తులసి మృతి పట్ల భెల్ సిఐటియు నాయకులు సంతాపం తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, కె.నారపరెడ్డి, జి.అచ్చన్నాయుడు, కె.కేశ్వ, జి.రాంబాబు, కె.పవన్ కుమార్ పేర్కొన్నారు.

మామిడి రైతు కుదేలు

తగ్గిన దిగుబడి

ఎకరాకు రూ.లక్షకుపైగా నష్టం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

ఈ ఏడాది మామిడి రైతు కుదేలయ్యాడు. ఎకరాకు కనీసంగా లక్ష రూపాయల ఆదాయం కోల్పోయాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడి దిగుబడి మూడు టన్నుల నుంచి టన్నుకు పడిపోయింది. జిల్లాలో 25 వేల నుంచి 30 వేల ఎకరాల వరకు రైతులు మామిడి తోటలు పెంచారు. 16 వేల మంది రైతులు మామిడి సాగు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అంచనా. ప్రధానంగా నక్కపల్లి, కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కె. కోటపాడు, సబ్బవరం మండలాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతియేటా ఎకరాకు మూడు నుంచి నాలుగు టన్నులు మామిడి కాయల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఆ దిగుబడి టన్నుకు పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను బంగినపల్లి మామిడి రకం రూ.40 నుంచి రూ.50 వేలు, సువర్ణరేక, ఇతర రసాలు కాయల పరిమాణాన్ని బట్టి రూ.60 నుంచి రూ.70 వేల ధర ఉంది. ధర ఉన్నప్పటికీ దిగుబడి తగ్గడంతో రైతులు నష్టపోయారు.

గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు, డిసెంబర్‌లో మిచౌంగ్ తుపానుతో సకాలంలో పువ్వు రాలేదు. జనవరిలో వచ్చిన పువ్వు అధిక మంచుకు మాడిపోయింది. దీనికితోడు బొడ్డుపుచ్చు, తేనె మంచుతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. మామిడి సీజన్‌లో రోజుకు దాదాపు 800 టన్నుల వరకు చేసిన ఎగుమతులు ఇపుడు 200 టన్నులకు తగ్గాయి. జిల్లాలో పండించిన మామిడి కాయలను వ్యాపారులు కొనుగోలు చేసి, ఏర్పాటు చేసిన పాకల్లో ముగ్గపెట్టి ఢిల్లీ, కొల్‌కతా, ముంబయి, బెంగళూరు, కటక్, బీహార్ సహా పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సంవత్సరం మామిడి పంటకు మంచి గిరాకీ ఉన్నప్పటికీ దిగుబడులు తగ్గడంతో రావాల్సిన ఆదాయం రైతు కోల్పోయాడు. మామిడి కాయలు తీయాల్సిన సమయంలో గాలులు రావడంతో కాయలు రాలిపోయాయి. దీంతో మామిడి రైతుకు మరింత నష్టం వాటిల్లింది. రైతులు ప్రతియేటా సకాలంలో మామిడి కొమ్మలు కత్తిరించి, ఉద్యానవన శాఖ సూచించిన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తే మామిడి దిగుబడిని పెంచవచ్చని అధికారులు చెబుతున్నారు. పూత వచ్చిన తరువాత పురుగులు, తెగుళ్ల నివారణకు నిమ్మకాయ దశ సైజులో మామిడికాయ వున్నపుడు ఫ్రూట్ బ్యాగ్స్ తగిలించి తీయడం ద్వారా నాణ్యమైన కాయలు దిగుతాయని అంటున్నారు



నక్కపల్లిలో కాయలు కానరాని మామిడి చెట్టు

3 ఎకరాల తోట ఉన్నా.. ఏ చెట్టూ కాయలేదు

నాకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఈ ఏడాది ఏ చెట్టూ కాయలేదు. తోట దున్నేందుకు, ఎరువులు, క్రిమి సంహారక మందులకుగాను సుమారు రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టాను. ఫలితం రాలేదు. ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడాదికి ఒకసారి వచ్చే ఫల సాయం కోసం ఎదురుచూసినప్పటికీ తీవ్ర నిరాశే మిగిలింది.

దేవరపు శివ, రైతు, కాగిత, నక్కపల్లి మండలం


మెళకువలు పాటించాలి

రైతులు మామిడికాయ తీతలో కొన్ని పద్ధతులు పాటించాలి. ముదిరిన తరువాతే చిక్కాలతో తీయాలి. కాయ కిందపడకుండా తీయడంతో వాటి నాణ్యత బాగుంటుంది. మంచి ధర వస్తుంది. ఎటువంటి రసాయనాలూ వినియోగించకుండా, సేంద్రియ పద్ధతుల్లో ముగ్గపెట్టి మార్కెట్, రైతు బజార్లలో అమ్ముకోవాలి. అకాల వర్షాలు, గాలుల బారిన పడకుండా కోయాల్సిన కాయలను గుర్తించి వెంటనే కోసి మార్కెట్ చేసుకోవాలి.

జి.ప్రభాకరరావు,
జిల్లా ఉద్యానాధికారి, అనకాపలి

జీతాల కోసం ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం : తమకు పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించాలంటూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. కర్మాగారంలోని కోకో ఒవెన్, సింటర్ ప్లాంట్, ఆర్ఎంహెచ్‌పి, బ్లాస్ట్ ఫర్నేస్, ఎస్ఎంఎస్, మిల్స్, ఆక్సిలరీ షాప్స్ విభాగాధిపతుల కార్యాలయాల ఎదుట ఉక్కు కార్మిక సంఘాల ఆధ్వర్యాన పెద్దపెట్టున నినదిస్తూ ధర్నాలు చేశారు. స్టీల్ సిఐటియు నేతృత్వం వహించింది. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్టీల్ యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని విమర్శించారు. కార్మికులకు న్యాయంగా రావాల్సిన వేతనాలను ఆలస్యం చేసి వారిని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించలేని స్థితిలో యాజమాన్యం లేదన్నారు. కావాలనే కుయుక్తులు పన్నుతోందన్నారు. ఇతర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరిని పెద్ద ఎత్తున పోరాటాల ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.



ధర్నా చేస్తున్న ఉక్కు ఉద్యోగులు

చెత్తపై యూజర్ ఛార్జీలను వెంటనే రద్దు చేయండి

- మేయర్‌కు సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చెత్తపై యూజర్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి లేఖ రాశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో చెత్తపై యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని వైసిపి పాలక వర్గం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రతి ఇంటికీ నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్ ఛార్జీలు నిర్ణయించారని, వాటిని సిపిఎం ముందు నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రజల నుంచీ తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. అంతేగాకుండా యూజర్ ఛార్జీలు చెల్లించకుండా ప్రజలు నిరసన ఉద్యమం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తరువాత చెత్తపై యూజర్ ఛార్జీలను ఆస్తి పన్నుతో ముడిపెట్టి రూ.20 నుండి రూ.120 వరకు ఐదు స్లాబులుగా విడగొట్టి మరొక తీర్మానం చేశారని, అయినా ప్రజలు అత్యధిక మంది చెత్తపై యూజర్ ఛార్జీలు చెల్లించటంలేదని తెలిపారు. అధికారులు ప్రజలను బెదిరిస్తున్నా, చెత్త తీసుకెళ్లకపోయినా, ప్రజలపై దౌర్జన్యం చేసినా ప్రజలు చెత్త పన్ను చెల్లించేది లేదని తెగేసి చెబుతున్నారన్నారు.

ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌వాసులు, మధ్యతరగతి కాలనీ ప్రజలు ఈ ఛార్జీలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇప్పటికీ ఛార్జీలు చెల్లించకుండా పోరాటం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ యూజర్ ఛార్జీల ద్వారా వసూలు అవుతున్న సొమ్ము అత్యధిక భాగం అక్రమంగా కొంతమంది స్వాహా చేస్తున్న విషయం తమరికి తెలిసిందేనని మేయర్‌కు గుర్తుచేశారు. అలాగే 2024- 25 ఏడాదిలో చెత్త పన్ను 20 శాతం పెంచటానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికే నెలకు ఐదు కోట్ల రూపాయల చెత్త భారం మోపారని. అంతేగాక పెరిగిన ఆస్తి పన్నుతో, ప్రతి ఏడాది 15 శాతం ఆస్తిపన్ను పెంచడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నీటి ఛార్జీలు పెంచటానికి, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర నియోజక వర్గాల పరిధిలో మీటర్ల ద్వారా నీటి ఛార్జీలు వసూలుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ చర్యలు ద్వారా నీటి ఛార్జీలు నెలకు రూ.500కు పైగా పెరుగుతాయన్నారు. మురుగు నీటి ఛార్జీ పేర ప్రతి ఇంటి నుండి నెలకు రూ.40 వసూలుకు కూడా సిద్ధమయ్యారన్నారు. ఈ చర్యలన్నీ విరమించాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కావున తక్షణం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చెత్తపై యూజర్ ఛార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సిపిఎంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశాఖ నగర ప్రజలు చెత్తపై యూజర్ ఛార్జీలు చెల్లించరని తెలియజేశారు. ప్రజలపై దౌర్జన్యం, నిర్బంధం, దాడులకు అధికారులను పురికొల్పితే ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేశారు.